సాక్షి
ములుగు
శనివారం । 27 । ఏప్రిల్ । 2024



ప్రచారం హీటెక్కుతోంది..
ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పార్లమెంట్ సీట్లను గెలుచుకునేందుకు ప్రధాన పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. - IIలో▶



యజమాని ఇంటికే కన్నం
కూడు పెట్టిన తన యజమాని ఇంట్లో రూ.38 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ ఘటన హనుమకొండలోని సంతోష్‌నగర్‌లో చోటు చేసుకుంది. - IIలో▶

గరిష్టం/కనిష్టం
42.0^0 /27.0^0
వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నామినేషన్ల పరిశీలన పూర్తి

- మానుకోటలో ఐదుగురు, వరంగల్‌లో పది మందివి తిరస్కరణ

మహబూబాబాద్/కాశీబుగ్గ సెంటర్: మహబూబాబాద్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాలకు దాఖలైన నామినేషన్లను శుక్రవారం పరిశీలించారు. మానుకోటలో మొత్తంగా 30 మంది అభ్యర్థులు 56 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, స్క్రూటినీలో ఐదుగురివి (పత్రాలు సక్రమంగా లేకపోవడంతో) 11 సెట్లు తిరస్కరించారు. 25 మందితో జాబితా తయారు చేసినట్లు అధికారులు తెలిపారు.

- వరంగల్ పార్లమెంట్ స్థానానికి మొత్తం 58 మంది అభ్యర్థులు 89 సెట్ల నామినేషన్లు వేయగా, వివిధ కారణాలతో పదింటిని తిరస్కరించారు. 48 నామినేషన్లు ఆమోదించారు.

కౌలు భూముల ఆదాయం రూ. 1.60 లక్షలు

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయానికి చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు శుక్రవారం రామప్పలో వేలం పాటలు నిర్వహించగా రూ.1,60,500ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు. నలగుంట శివారులోని 2–02 ఎకరాల భూమికి రూ.30 వేలు, రామాంజాపూర్ శివారులోని (లక్ష్మీదేవిపేట) 9–09 ఎకరాలకు రూ.51 వేలు, పాలంపేట శివారులోని (గార్లగడ్డ) 3–20 ఎకరాలకు రూ.79,500 రూపాయాలు వేలం పాటల ద్వారా వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ పరిశీలకుడు అనిల్‌కుమార్, పూజారులు హరీష్‌శర్మ, ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

29న మల్లూరు జాతర వేలం

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు (జాతర)లో వివిధ రకాల వ్యాపారాల నిర్వాహణకు బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రావణం సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర సందర్భంగా 2024 మే 5 నుంచి జూన్ 4 వరకు నెల రోజుల పాటు ఆలయ ప్రాంగణం పరిధిలో లడ్డు, పులిహోర ప్రసాదాలు తయారు చేసి విక్రయించుటకు అనుమతి పొందేందుకు రూ 1 లక్ష, భక్తులు స్వామివారికి సమర్పించే పుట్టు వెంట్రుకలు(తలనీలాలు) పోగు చేసుకునేందుకు రూ.2 లక్షలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు రూ 10,000, పూలు, పూలదండలు అమ్ముకునేందుకు రూ 5000, చెప్పుల స్టాండ్ నిర్వాహణకు రూ 5000, ఫొటోలు తీసుకునేందుకు రూ 5000 డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన వచ్చన్నారు. వేలం పాటలు దేవాదాయశాఖ కమిషనర్ హైదరాబాద్ తుది ఆమోద ఉత్తర్వులకు లోబడి ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 25 నుంచి 29 వరకు హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన టెండర్ బాక్సులో వేయాలన్నారు.

వన్యప్రాణుల వేట అరికట్టడానికి సహకరించాలి

కాటారం: వన్యప్రాణుల వేట నిర్మూలనలో భాగంగా అధికారులు చేపడుతున్న చర్యలకు ఎలక్ట్రికల్, ఐరన్ హార్డ్‌వేర్ దుకాణాల యజమానులు సహకరించాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ఎలక్ట్రికల్, ఐరన్ హార్డ్‌వేర్ దుకాణాల యజమానులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. అటవీ జంతువుల వేట కోసం కొందరు వేటగాళ్లు కరెంట్ తీగలు, ఉచ్చులు వాడుతున్నారని వేటకు సంబంధించిన సామగ్రిని అపరిచితులు, అనుమానిత వ్యక్తులకు విక్రయించవద్దని సూచించారు. ఈ సమావేశంలో కాటారం ఎస్సై మ్యాక అభినవ్ పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు..

సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని ఉర్సుగుట్టలో అత్యధికంగా 45డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత శుక్రవారం నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొయ్యూరులో 44.6డిగ్రీల సెల్సియస్, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 44.5డిగ్రీల సెల్సియస్, ములుగు జిల్లా వాజేడులోని ధర్మవరంలో 44.4డిగ్రీల సెల్సియస్, హనుమకొండ జిల్లా దామెర మండలంలో 44డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ విభాగాధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరగనుందని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని తెలిపారు. ఇప్పటికే జిల్లా వైద్యాధికారులు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలతోపాటు ఆయా గ్రామ ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని వివరించారు. ఇంకోవైపు పార్లమెంట్ ఎన్నికల వేళ రాజకీయ ప్రచారం ఊపందుకుంటుండడంతో అన్ని పార్టీల కార్యకర్తలు ఎండ వేడిమికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కనబడుతోంది.

మృత్యు‘దారులు’



ఎస్ఎస్ తాడ్వాయి: జాతీయ రహదారిపై పడిన గాడీలు



ఏటూరునాగారం: గాడీలతో కింద పడిన ద్విచక్రవాహనం (ఫైల్)

ఎన్‌హెచ్‌–163పై గాడీలు

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

ఏటూరునాగారం/ఎస్ఎస్ తాడ్వాయి : జిల్లాలోని పస్రా నుంచి ముళ్లకట్ట వరకు 163 జాతీయ రహదారి మృత్యుఘోషను తలపిస్తుంది. నిత్యం వందలాది ఇసుక లారీలు 163 జాతీయ రహదారిపై వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లి వస్తుంటాయి. వందలాది ఇసుక లారీల అధిక లోడ్‌తో ఈ జాతీయ రహదారిపై వెళ్తుండటంతో ఒక సైడ్ మొత్తం నాలుగు నుంచి ఐదు ఇంచుల గాడీలు ఏర్పడ్డాయి. పస్రా నుంచి వాజేడు వరకు నిత్యం ద్విచక్ర వాహనదారులు ఈ గాడీల కారణంగా పడిపోయి కాళ్లు చేతులు విరగడం, తలకు బలమైన గాయాలు కావడం జరుగుతుంది. శుక్రవారం ఏటూరునాగారం చెక్‌పోస్టు దాటిన తర్వాత ఓ ద్విచక్రవాహనదారుడు కిందపడి తలపగిలింది. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో 108లో ఆస్పత్రికి తరలించారు. ఇలాంటి సంఘటనలు రోజుకో చోట జరగటంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్తున్న పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా కార్లు, ఆటోలు ఈ గాడీలతో వన్ సైడ్ ప్రయాణం చేయడం వల్ల ఎదురెదురుగా వాహనాలు ఢీకొని నిత్యం రక్తాన్ని చిందిస్తున్నాయి. ఎంతోమంది కుటుంబాల్లో కడుపుకోతను నింపుతున్న ఈ రహదారిని వెంటనే మరమ్మతు చేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

మూడు నెలలు గడవక ముందే..

ఎస్ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలో జాతీయ రహదారిని విస్తరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మేడారం మహాజాతరకు వారం రోజుల ముందుగా రోడ్డు పనులను పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణం చేసిన మూడు నెలలు గడవక ముందే ఇసుక లారీల రాకపోకలతో రోడ్డుపై గాడీలు (అచ్చులు) పడుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో హడావుడి పనులు, నాణ్యతా లోపంతో ఇసుక లారీలు నడవడంతోనే రోడ్డుపై అచ్చులు ఏర్పడుతున్నాయి. మేడారం జాతరను పురస్కరించుకొని రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్ హడావుడిగా పనులు చేపట్టడంతోనే లారీల తాకిడికి రోడ్డు గాడీలు పడుతుందని బాహాటంగా చర్చించుకుంటున్నారు. జాతీయ రహదారి రోడ్డు నిర్మాణం పనులను నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకున్నట్లు కనబడటం లేదు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారి నిర్మాణం పనులు ఎంతో నాణ్యతగా చేపట్టాల్సి ఉన్నా.. కాంట్రాక్టర్ ఇష్టారీతిగా వ్యవహరించి చేసిన పనులకు అధికారులు వంత పాడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారిపై ఏర్పడిన గాడీలతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రహదారిపై ఉన్న గాడీలను సరిచేసేలా పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా

ములుగు: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిబంధనలు తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. 85 ఏళ్లుపైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఎసెన్షియల్ సర్వీస్ ఓటర్లు కోవిడ్ బాధితులు తమ ఓటు హక్కును వినియోగించుకోవటానికి ఎన్నికల కమిషన్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించిందని, మే 3 నుంచి 8వ తేదీలోపు వారి ఓటును నమోదు చేస్తామన్నారు. ప్రతీ ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనల మేరకు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇంటి నుంచి ఓటు వేసే పక్రియను వీడియో రికార్డు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ ఉన్నారు.

‘ఆయిల్ పామ్’లో జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా ఉద్యాన అధికారి వేణుమాదవ్



ఆయిల్‌పామ్ మొక్కను పరిశీలిస్తున్న అధికారులు

గోవిందరావుపేట: ఆయిల్ పామ్ సాగులో తగు జాగ్రత్తలు తీసుకోవాలిన జిల్లా ఉద్యన అధికారి వేణుమాదవ్ అన్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ పంట పెరుగుదలను కాపాడుకుంటూ మంచి దిగుబడి సాధించేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను శుక్రవారం రైతులకు సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 1,847 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుంది. ఒకటి నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల ఆయిల్ పామ్ తోటల్లో, మొక్కకు మూడు అడుగుల దూరంలో జనుమును పచ్చి రొట్ట ఎరువు పంటగా నాటుకోవాలి. జనుము పూతకు వచ్చిన వెను వెంటనే చిన్న చిన్న ముక్కలుగా కోసి పాదులో చుట్టూ వేయాలి. ప్రతీఆయిల్ పామ్ మొక్కకు ఇరువైపులా ఒక్కో మైక్రోజెట్ (30 లీటర్లు లేదా 40 లీటర్లు డిశ్చార్జ్ అయ్యేవి) అమర్చుకోవాలి. చెలుపు లేదా వృథాగా పచ్చి ఆకులను నరక రాదు. ఆయిల్ పామ్ తోటలలో అంతర పంటలు వేసినట్లయితే, ఆయిల్ పామ్ తో పాటు అంతర పంటలకు కూడా సిఫారసు మేరకు నీరు తప్పనిసరిగా అందేలా చూసుకోవాలి. ఇతర సమాచారం కొరకు ఐసీఏఆర్–ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ (ఐఐఓపీఆర్), పెదవిగి వారు ఆయిల్ పామ్ పంట సాగులోని మెళకువలను లఘు చిత్రాలుగా యూట్యూబ్‌లో పొందుపరిచారని, ఐసిఏఆర్–ఐఐఓపిఆర్ వారి ఆయిల్ పామ్ పంట సాగులోని మెళకువలపై గూగుల్ ప్లేస్టోర్‌లో పొందుపరిచిన మొబైల్ యాప్స్ (ఆయిల్ ఫామ్ క్రాప్ డాక్టర్) ను ఉచితంగా డౌన్లోడ్ చేసుకొని ఉపయోగించుకోవాలన్నారు.

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి సీతక్క



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట: ఉపాధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో మంత్రి దనసరి సీతక్క కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అధ్యక్షతన విస్తృత ప్రచారం చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మచ్చాపూర్ గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనులను పరిశీలించి, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. అలాగే మండలంలో కొండల నడుమన అందమైన ప్రకృతి ఒడిలో పుట్టిన లక్నవరం సరస్సును రాష్ట్ర మంత్రి సీతక్క సందర్శించారు. సరదాగా బోటింగ్ చేసి లక్నవరం అందాలను వీక్షించారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి శుక్రవారం భారీగా చేరికలు జరిగాయి. ఈ చేరికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సూరపనేని సాయికుమార్ ఆధ్వర్యంలో భారీగా చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దు

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కవిత

మంగపేట: మోసపూరిత కాంగ్రెస్ పార్టీని రైతులు, ప్రజలు నమ్మొద్దని మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. మండలంలోని రాజుపేటలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ పాలనలో మండు వేసవిలో చెరువులు మత్తడి పోశాయని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో చుక్కనీరు లేక వెల వెల బోతున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేసే ముందు తెలంగాణ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు, ములుగు జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ మన ఇంటి ఆడబిడ్డ కవితను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, యడ్లపెల్లి నర్సింహారావు, చిట్టిమళ్ళ సమ్మయ్య, శంకర్, ముకుందం, లక్ష్మణ్‌రావు, ధనలక్ష్మి, ఊడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తిమ్మంపేటలో దివ్యాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

నేటినుంచి బీరమయ్య జాతర

వాజేడు: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన లొట్టిపిట్ట గండి వద్ద నేటి (శనివారం) నుంచి సోమవారం వరకు బీరమయ్య (భీష్మ శంఖరుడు) జాతర జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని టేకుల గూడెం, పెదగంగారం, కృష్ణాపురం, కడేకల్ గ్రామాలకు చెందిన గిరిజనులు తమ సంప్రదాయం ప్రకారం ఈ జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. శనివారం ఉదయం నుంచి సమీప గ్రామాలకు చెందిన ప్రజలు తమ దేవర్లను (దేవతలను) ఊరేగింపుగా జాతర ప్రాంతానికి తీసుకెళతారు. రాత్రి 8 గంటలకు గిరిజనులు తమ ఆచారాల ప్రకారం నృత్యాలను చేస్తారు. ఆదివారం ఉదయం 4 గంటల ప్రాంతంలో గోదావరిలో స్నానాలను ఆచరించి బీరమయ్యను ప్రతిష్ఠిస్తారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకునే కార్యక్రమాన్ని మొదలు పెడతారు. సోమవారం ఎవరి ఇళ్లకు వారు బయలు దేరి వెళ్లడంతో జాతర తంతు ముగుస్తుంది.

రెండు రైస్ మిల్లులపై కేసు నమోదు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని సీఎంఆర్ చేయని రెండు రైస్ మిల్లులపై పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేసి యజమానులపై కేసు నమోదు చేయించినట్లు జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాఘవేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022–23లో కాటారం మండలకేంద్రంలోని రుద్ర రైస్ మిల్‌కు వానాకాలంలో 3,465 టన్నుల పంపగా 2,990 టన్నుల ధాన్యం మర ఆడించి 2,322 టన్నుల బియ్యం మాత్రమే సరఫరా చేసినట్లు తెలిపారు. 474 టన్నుల ధాన్యం సరఫరా చేయాల్సి ఉండగా యాసంగిలో 934 టన్నుల ధాన్యం పంపగా తిరిగి బియ్యం సరఫరా చేయలేదన్నారు. దీంతో ఈ మిల్లు ద్వారా ప్రభుత్వానికి రూ.4కోట్ల నష్టం కలిగినట్లు తెలిపారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని సువర్ణలక్ష్మి శ్రీనివాస ట్రేడర్స్ 2,302 టన్నుల ధాన్యం పంపగా 1,174 టన్నుల బియ్యం పంపించారని, ఇంకా మిగిలి బియ్యం పంపించలేదని తెలిపారు. ఈ మిల్లు ద్వారా ప్రభుత్వానికి రూ.1.66కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దీంతో రైస్ మిల్లులపై తనిఖీలు నిర్వహించగా ధాన్యం నిల్వలు కనిపించలేదని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లలో మిల్లు యజమానులు సీహెచ్.రవికాంత్, పి.విజయభాస్కర్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేయించినట్లు తెలిపారు.

వైభవంగా దివ్యాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం

భారీగా తరలివచ్చిన జనం



ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు



క్రేన్ సాయంతో ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న కమిటీ సభ్యులు

మంగపేట: మండలంలోని తిమ్మంపేటలో శ్రీ మహాలక్ష్మీయుత సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీ సీతారామచంద్ర స్వామి నూతన దివ్యాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. శ్రీ కోదండరామచంద్రస్వామి వారి మూలమూర్తి, ఉత్సవబింబ, శిఖర భక్తాంజనేయ, ఆలయ ధ్వజస్తంభ, జయవిజేయులు (ద్వార పాలకులు) యంత్ర ప్రతిష్ఠాపూర్వక ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం విశ్రాంత ప్రధానాచార్యులు శ్రీమాన్ పొడిచేటి రామచంద్రస్వామి పర్యవేక్షణలో ఆయన శిష్యబృందం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేద మంత్రోచ్ఛారణ నడుమ వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 23 నుంచి ప్రారంభమైన కార్యక్రమాల్లో గ్రామస్తులతో పాటు వ్యాపారం, ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబాలతో పాటు వారి బంధువులు తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 10.38 గంటలకు నిర్వహించిన ధ్వజస్తంభం, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని నవధాన్యాలు సమర్పించేందుకు గ్రామస్తులతో పాటు సమీపంలోని చెరుపల్లి, మల్లూరు, బోరునర్సాపురం, మంగపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు, ఆలయ నిర్మాణ దాతలు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి మహాన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటూరునాగారం సీఐ రాజు, ఎస్సై గోదరి రవికుమార్, సిబ్బందితో బందోబస్తు నిర్వాహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు ఆక రాధాకృష్ణ, ఆక రవి, తాటి కృష్ణ, యగ్గడి సత్యం, చిలకమర్రి లక్ష్మయ్య, దంతెనపెల్లి బద్రయ్య, చిలకమర్రి సతీష్, రవి, ఆక సతీస్, మంచాల సతీష్, చిలకమర్రి వేణు, పూజారి సురేందర్, చిలకమర్రి శీనివాస్, చిలకమర్రి రాజేందర్, పెట్రం సుధాకర్, దంతెనపెల్లి నరేందర్, యగ్గడి అర్జున్, శానం నవీన్, సత్యనారాయణ, ఆకిరెడ్డి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఆరుగురి అరెస్ట్



అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వాజేడు: గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వేంకటేశ్వరరావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి శ్మశాన వాటికి సమీపంలో కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఆరుగురు వ్యక్తులు పోలీసులను చూసి ఇప్పగూడెం నుంచి పరారవుతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 3 ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. కాగా ఇందులో ముగ్గురు బాల నేరస్తులు ఉన్నారు. కేసు నమోదు అయిన వారిలో ఇప్పగూడెం గ్రామానికి చెందిన కారం జయంత్, గుమ్మడ దొడ్డికి చెందిన బోదెబోయిన వినయ్, మొరుమూరు కాలనీకి చెందిన మడకం పవన్, బాల నేరస్తులు ఉన్నట్లు సీఐ బండారి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

ప్రణాళికా బద్ధంగా తాగునీటి సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న షఫి ఉల్లా


పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక కమిషనర్ షఫి ఉల్లా

ములుగు: గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా ప్రజలకు తాగునీరు అందించాలని, నర్సరీ ప్లాంటేషన్‌లో మొక్కలకు నిరంతరం సమృద్ధిగా నీరు అందించాలని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ షఫి ఉల్లా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్‌లతో కలిసి ఆయన తాగునీటి సరఫరా, నర్సరీల నిర్వహణ, ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే ప్రత్యేక అధికారులు నర్సరీల పెంపకంపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. నర్సరీల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించకూడదని నర్సరీ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగు నీటి సరఫరా, నర్సరీ ప్లాంటేషన్ పెంపకంలో గ్రామస్థాయిలో సమస్యలు తలెత్తితే వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. సమస్య తీవ్రతను బట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేయాలని ఏదైన గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించక పోతే గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఈజీఎస్ వెంకటనారాయణ, మండల ప్రత్యేక అధికారులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ములుగు రూరల్: ఉపాధి పనులు నిర్వహించే ప్రాంతాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని పంచాయతీరాజ్ స్పెషల్ ఆఫీసర్ షఫీ ఉల్లా అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని మహ్మద్ గౌస్‌పల్లిలో ఉపాధి పని ప్రదేశాలను పరిశీలించారు. ఉపాధి కూలీలు పని చేసే ప్రతిరోజు రూ.300 వచ్చే విధంగా కూలీలు పని చేయాలని సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీడ, మంచినీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ మాలోతు రాజు, జూనియర్ ఇంజనీర్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్, రాజేష్, సతీష్, సాలయ్య పాల్గొన్నారు.

వరిపంట..గొర్రెలకు మేత



వెంకటాపురం(ఎం): భూగర్భజలాలు అడుగంటి బోరు నీరు రాకపోవడంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన వరిపంట పొట్టదశలో నీరు లేక ఎండిపోతుండడంతో గొర్రెలకు మేతగా మారింది. మండల కేంద్రానికి చెందిన జంగిలి సతీష్ ఎకరం భూమిలో వరిపంట సాగు చేశారు. పొట్టదశలో బోరు మోటారు ద్వారా నీరు రాకపోవడంతో పంటను వదిలివేశాడు. దీంతో వరిపంట శుక్రవారం గొర్రెలకు మేతగా మారింది.

మీకు తెలుసా.?

ప్రతీ పోలింగ్ కేంద్రంలో 1,400 మంది ఓటర్లే..



కాజీపేట : ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు తెలుసుకోవాల్సిన విషయాలు చాలానే ఉన్నాయి. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ ఒక దానికొకటి అనుసంధానంగా పని చేస్తాయి. ఇందులో ఈవీఎంల పాత్ర కీలకమైంది. ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,400 మంది ఓటర్లు మాత్రమే ఉంటారు. ఈ సంఖ్యను ఎందుకు పరిమితం చేస్తారంటే.. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియలో వినియోగిస్తున్న ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీ ప్యాట్‌లో థర్మల్ కాగితం పొందుపరుస్తారు. ఈ కాగితం 1,500 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. 25.5 ఓల్టుల బ్యాటరీతో పనిచేసే వీవీప్యాట్‌లో ఓటు ఎవరికి వేశామనేది డిస్‌ప్లేలో కనిపిస్తుంది. ఇందులో వంద వరకు కాగితపు స్లిప్పులు పోలింగ్ రోజున మాక్ పోలింగ్ ప్రక్రియకు ఖర్చు అవుతాయి. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది.



పబ్లిక్ గార్డెన్‌లో వ్యాయామం చేస్తున్న అరూరి రమేశ్

ప్రచార.. రిమ్‌జిమ్..

వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ శుక్రవారం ఉదయం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే ధర్మారావులతో కలిసి వాకర్లను ఓటు అభ్యర్థించారు. కాసేపు గార్డెన్‌లోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేశారు.

- హన్మకొండ చౌరస్తా

రూ.18లక్షల నగదు పట్టివేత



కేసముద్రం: నగదును చూపుతున్న ఎస్సై

కేసముద్రం : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద కారులో తరలిస్తున్న రూ.18లక్షల నగదును శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. కేసముద్రంవిలేజ్‌కి చెందిన ఎస్.హరి తనకారులో వరంగల్ వైపునకు వెళ్తుండగా, కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద కారును ఆపి పోలీసులు తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.18లక్షలు లభ్యంకావడంతో వాటిని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై వంశీధర్ పేర్కొన్నారు.

తనిఖీల్లో రూ.4.69లక్షల నగదు స్వాధీనం

కాజీపేట : కాజీపేట పట్టణం డీజిల్ కాలనీ ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.4.69లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో ద్విచక్ర వాహనాలను ఆకస్మికంగా ఆపి సోదాలు నిర్వహించారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన సంగి ప్రశాంత్ వద్ద రూ.1.62లక్షలు, గుజ్జెటి లక్ష్మీనారాయణ వద్ద రూ.4.07లక్షలు దొరికినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

రూ.3.50లక్షల నగదు లభ్యం

కురవి : మండలంలోని నేరడ శివారు బాల్యా తండాకు చెందిన ఓ వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.3.50లక్షలు తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలో పట్టుబడినట్లు ఎస్సై బి.గోపి శుక్రవారం తెలిపారు. పట్టుబడిన నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు ఆయన వివరించారు.

రూ.1,01,000 నగదు..

గార్ల : కొత్తగూడెం గ్రామానికి చెందిన చెన్ను శివలింగం ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.1,01,000 నగదు తీసుకెళ్తుండగా సత్యనారాయణపురం క్రాస్‌రోడ్ వద్ద పోలీసులు తనిఖీలో నగదుతో పట్టుబడ్డాడు. ఈ తనిఖీల్లో గార్ల-బయ్యారం సీఐ బి.రవికుమార్, ఎస్సై ఎస్.జీనత్ కుమార్,శివ, ఏఎస్సై వీరారెడ్డి పాల్గొన్నారు.

రూ.68,800 నగదు..

వేలేరు : వేలేరు నుంచి పీచర వెళ్లే దారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా సొన్నాయిల స్వరూప ఎలాంటి ఆధారం లేకుండా రూ.68,800ల నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై డి.హరిత శుక్రవారంతెలిపారు.

చెక్‌పోస్ట్ వద్ద రూ.లక్ష నగదు..

దోర్నకల్ : అమ్మపాలెం క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం మంచుకొండకు చెందిన వినోద్ తన బొలేరో వాహనంలో లక్ష రూపాయల నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ముల్కలపల్లికి చెందిన బోడ సాయికుమార్ ఖమ్మం నుంచి బొలేరో వాహనంలో వస్తుండగా తనిఖీలు నిర్వహించి ఆధారం లేని రూ.52,000ల నగదు సీజ్ చేశారు.

3న వరంగల్‌కు ప్రధాని మోదీ



స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మడికొండ : మే 3వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ పర్యటన ఖరారయ్యింది. దీంతో భారీ బహిరంగ సభను నిర్వహించడానికి ఖిలా వరంగల్ ఏరియాతోపాటు మడికొండ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని శుక్రవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్, పార్లమెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు మార్తినేని ధర్మరావు, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి, పార్లమెంట్ ప్రభారీ మురళీధర్‌గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కీర్తిరెడ్డి, కేశవరెడ్డి, కుమారస్వామి, జిల్లా నాయకులు పొనగోటి వెంకట్‌రావు, గడ్డం మహేందర్, బొల్లికొండ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ముమ్మాటికీ బ్రోకరే

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

హన్మకొండ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముమ్మాటికీ బ్రోకరేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమాలు చేసి సీఎం కాలేదని, బ్రోకరిజం చేసి అయ్యాడని, ప్రజాభిమానం ఉంటే కామారెడ్డిలో ఎందుకు ఓడిపోయాడని ప్రశ్నించారు. ఆయన ఎంపీగా ప్రాతినిథ్యం వహించిన మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ గెలవలేదని విమర్శించారు. కడియం శ్రీహరిని తానే పిలిచానని చెబుతున్న రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఎందుకు కోరలేదని ప్రశ్నించారు. పదవికి రాజీనామా చేయకుండా పార్టీ మారిన వారిని పిచ్చికుక్కను కొట్టినట్లు రాళ్లతో కొట్టాలని, తాను బాధ్యత వహిస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి.. శ్రీహరి విషయంలో ఎందుకు పాటించలేదని నిలదీశారు. రేవంత్ రెడ్డి వరంగల్‌కు వచ్చి బ్రోకర్ మాటలు మాట్లాడారని ధ్వజమెత్తారు. ఇప్పుడు రాళ్లతో కొట్టాల్సింది రేవంత్ రెడ్డినేనని.. రాబోయే రోజుల్లో ఇదే జరుగుతుందని హెచ్చరించారు. శ్రీహరితో రాజీనామా చేయించకపోతే మీతో పాటు కడియంపై రాళ్లు పడే అవకాశముందని, ఇదే జరిగితే దానికి సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత అన్నారు. కడియం శ్రీహరి ఎస్సీ కాదని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఆయన కూతురుకు ఎలా టికెట్ ఇస్తారని ప్రశ్నించారు. రూ.100 కోట్లు ఖర్చు పెట్టి కూతురును గెలిపించుకోవాలని చూస్తున్నాడని ఆరోపించారు.ఓటర్లు రూ.5 వేలు, రూ.10 వేలు ఇచ్చిన తీసుకుని ఓటు మాత్రం బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న, జన్ను దినేష్, గద్దల సుకుమార్, బండారి సురేందర్, మంద రాజు, బిర్రు మహేందర్, కందికట్ల విజయ్, ఏకు శంకర్, చేతల్ల రమేష్, కట్ట రాజశేఖర్ పాల్గొన్నారు.



ప్రచారం హీటెక్కుతోంది..

ఓవైపు మండుటెండలు, ఇంకోవైపు రాజకీయ జోరు

- ఇప్పటికే ఉమ్మడి వరంగల్‌లో సీఎం రెండు సభలు
- హనుమకొండలో భారీ ర్యాలీ నిర్వహించిన బీజేపీ నేతలు
- మాజీ మంత్రి కేటీఆర్ సమీక్షతో గులాబీ శ్రేణుల్లో జోష్



సాక్షి, వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ సీట్లను గెలుచుకొనేందుకు ప్రధాన పార్టీలు (కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్) దృష్టి సారించాయి. ఓవైపు భానుడు నిప్పుల కొలిమిలా మండుతున్న లెక్కచేయకుండా అన్ని పార్టీల కార్యకర్తల నుంచి అగ్రనేతల వరకు రోడ్డెక్కి ప్రచారంలో హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబాబాద్‌తో పాటు హనుమకొండ బహిరంగ సభలతో కార్యకర్తల్లో జోష్ నింపారు. ఇంకోవైపు బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ నామినేషన్ సందర్భంగా హనుమకొండలోని వేయిస్తంభాల గుడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పాల్గొన్నారు. మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ బస్సుయాత్ర ఆదివారం హనుమకొండకు రానుండడంతో ప్రచారం మరింత పీక్ స్టేజీకి చేరుకోనుంది.

మిగిలింది 15 రోజులే..

గురువారంతో నామినేషన్ల సమర్పణ పూర్తయింది. ప్రచారానికి మరో 15 రోజులు సమయం మాత్రమే ఉండడంతో అన్ని పార్టీలు క్షేత్రస్థాయిలో తమ ప్రచారాన్ని ముమ్మరంచేశాయి. ఇప్పటికే వరంగల్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయా పార్టీలు కీలక నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాయి. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పినపాక, ఇల్లందు, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎండలు మండుతుండడంతో ఇన్నిరోజులు ఫంక్షన్ హాల్స్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించిన ఆయా పార్టీలు ఇప్పుడూ రోడ్డెక్కి ప్రచారం చేస్తుండడంతో పొలిటికల్ హీట్ పెరిగింది.

గెలుపే లక్ష్యంగా ..

వరంగల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ అధిష్టానం వ్యూహాలు రచిస్తోంది. ఈ నెల 23న మంత్రి కేటీఆర్ వరంగల్, హనుమకొండలో పార్లమెంట్ ఎన్నికల విస్తృత స్థాయి సమావేశాల్లో పాల్గొని కాంగ్రెస్‌ను ఎలా ఎదుర్కొవాలో, బీజేపీని ఎలా నిలువరించాలనే అంశంపై క్యాడర్ లో జోష్ నింపారు. 28న హనుమకొండలోని అంబేడ్కర్ కూడలి నుంచి హనుమకొండ చౌరస్తా వరకు కేసీఆర్ బస్సుయాత్రకు భారీ జనసమీకరణ చేసేందుకు ఆ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. హనుమకొండ కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి కేసీఆర్ మాట్లాడనున్నారు.

ఎమ్మెల్యేలే కీలకంగా..



ఓవైపు ఇతర పార్టీల నుంచి ముఖ్య నేతల చేరికలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీట్లు గెలుచుకునే వ్యూహాలు రూపొందిస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి రెండు బహిరంగ సభలు నిర్వహించడంతో హస్తం పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ తరఫున పోరిక బలరాం నాయక్ గెలుపునకు నాయకులు కృషి చేస్తున్నారు. హాట్‌టాపిక్‌గా మారిన వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి అనూహ్యంగా టికెట్ దక్కించుకున్న కడియం కావ్యను గెలిపించేందుకు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరినీ మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు.

చేరికలను ప్రోత్సహిస్తూనే.. ప్రచారం

వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ నామినేషన్ ర్యాలీకి ఉత్తరాఖండ్ సీఎం ధామి రాకతో కమలదళంలో మరింత జోష్ పెరిగింది. ఓ వైపు ఇతర పార్టీల నుంచి నేతల చేరికలను ప్రోత్సహిస్తూనే గత వైభవాన్ని తీసుకొచ్చేలా ప్రణాళికతో ముందుకెళ్తోంది. మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్ కూడా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలియ తిరుగుతూ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ రెండు స్థానాల్లోనూ బీజేపీ జెండా ఎగరవేసేలా రానున్న రోజుల్లో అగ్రనేతల పర్యటనలు ఉంటాయని ఆ పార్టీ శ్రేణులంటున్నాయి.

హ్యాండ్‌బాల్ హంట్ విజేత కరీంనగర్



ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జట్టు



రన్నరప్ ట్రోఫీతో వరంగల్ క్రీడాకారులు

- రన్నరప్‌గా వరంగల్ జట్టు



ప్రీమియర్ లీగ్ ట్రోఫీతో వరంగల్ జట్టు

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన 6వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ హంట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్-15 (సబ్ జూనియర్స్) బాలుర విభాగంలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 29 జట్లు హాజరైనట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో కాటారం (కరీంనగర్) విజేతగా నిలిచి ట్రోఫీ అందుకోగా, రన్నరప్‌గా కొత్తగూడ (వరంగల్) జట్టు నిలిచి, తృతీయ స్థానంలో కేవీ పికెట్ (హైదరాబాద్) జట్టు సరిపెట్టుకుంది. ముగింపు ఉత్సవాలకు హనుమకొండ జిల్లా క్రీడల, యువజన అధికారి గుగులోత్ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, వరంగల్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరబోయిన సాంబశివరావు, టెక్నికల్ అఫీషియల్స్, పీఈటీలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ చాంపియన్ వరంగల్

ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ చాంపియన్‌షిప్‌ను కాకతీయ వరంగల్ జట్టు కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో జరిగిన తుదిపోరులో హైదరాబాద్‌పై వరంగల్ విజయం సాధించింది. జట్టు విజయానికి క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించిన హనుమకొండ డీఎస్‌ఏ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్‌ను పలువురు అభినందించారు.



సాధారణ బోగీలను ఐదుకు పెంచాలి

- సాధన సమితి సభ్యుల డిమాండ్
- ప్రధాన మంత్రికి ఉత్తరాలతో విజ్ఞప్తి



ఉత్తరాలతో ఐదు సాధారణ బోగీల సాధన సమితి సభ్యులు

కాశిబుగ్గ: దేశంలోని ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్య ఐదుకు పెంచాలని ఐదు సాధారణ బోగీల సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్రధాన మంత్రికి కోటి ఉత్తరాలతో విజ్ఞప్తి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని రైళ్లలో ఎక్కువగా ప్రయాణించేది పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలేనని వారు ప్రయాణించే సాధారణ బోగీల సంఖ్యను పెంచాలన్నారు. దేశ ప్రజలంతా కోటి ఉత్తరాల కార్యక్రమంలో పాల్గొని ప్రధానికి ఉత్తరాలు రాయాలని పిలుపునిచ్చారు. అనంతరం సుమారు 200 మంది ఉత్తరాలు రాసి పోస్ట్ డబ్బాలో వేశారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు డాక్టర్ పి.అశోక్, ఎ.రాజేంద్రప్రసాద్, పి.శ్రీనివాస్, ఎండీ ఉస్మాన్, కిరణ్, విజయకుమార్, రాజు, గోపీ, సందీప్, స్వామి, రమేశ్, సునీల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కాగర్'ను నిలిపేయాలి

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.కుమారస్వామి



సంస్మరణ సభలో పాల్గొన్న నాయకులు

చిట్యాల : నాలుగు నెలలుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బీజేపీ అమలు చేస్తున్న ఆపరేషన్ కాగర్‌ను నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు మాదన కుమారస్వామి తెలిపారు. ఆపరేషన్ కాగర్‌లో అనేక మంది ఆదివాసీలు, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చివేస్తున్నారని వెంటనే దానిని నిలిపివేయాలని కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని చల్లగరిగలొ ఇటీవల బూటకపు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, అతని భార్య సుమన అలియాస్ రజితతో పాటు 29 మంది మావోయిస్టుల 'సంస్మరణ సభ'ను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కమిటీ, విరసం నేతల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాదన కుమారస్వామి, బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ కుమారి హాజరై మాట్లాడుతూ ఉద్యమకారులను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. అలాగే ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు, హెలికాప్టర్ దాడులు చేస్తూ సహజ న్యాయమైన సూత్రాలను ఉల్లంఘిస్తూ క్రూరమైన బీభత్సాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో ఆపరేషన్ కాగర్, సైనిక క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమరుల బంధు మిత్రుల సంఘం, విరసం, పౌర హక్కుల సంఘం, రైతుల సమస్యల సాధన సమితి, ప్రజా కళామండలి, దళిత లిబరేషన్ ఫ్రంట్, తెలంగాణ ఉద్యోగుల సంఘం,సామాజిక ఉద్యమ నాయకులు శాంతక్క, సత్యక్క, బాలసాని రాజయ్య, రాజగోపాల్, వినోద్, రవి, సంజీవ్‌కుమార్, రాజలింగు, కిరణ్, అంజన్న, గట్టయ్య, మల్లయ్య, బాపు, వెంకట్‌రెడ్డి, రత్నకుమార్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలం కబ్జాకు గుర్తు తెలియని వ్యక్తుల యత్నం

- పొక్లెయినర్‌తో తవ్వకాలు
- అడ్డుకున్న స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు
- కాశిబుగ్గ ఓ సిటీలో ఘటన



తవ్వడానికి వచ్చిన పొక్లెయినర్

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ ఓ సిటీ రోడ్డులోని శ్రీ సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప శివ పంచాయతన ఓంకారేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ మండప భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసేందుకు శుక్రవారం ప్రయత్నించారు. స్థానికులు ఆలయ కమిటీ సభ్యులు అడ్డుకుని వారిని పోలీసులకు అప్పగించారు. స్థానికులు, కమిటీ సభ్యుల కథనం ప్రకారం.. ఓ ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఓ కారు, పొక్లెయినర్‌తో మధ్యాహ్నం దేవాలయానికి అనుకుని ఉన్న మండప భూమిని కబ్జా చేసేందుకు వచ్చి చెట్లు నరకడం, గుంతలు తీయడం ప్రారంభించారు. అది గమనించిన స్థానికులు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు అక్కడికి చేరుకుని స్థానికుల సాయంతో అడ్డుకున్నారు. ఇది దేవుడి భూమి అని.. ఇక్కడ మీరేందుకు గుంతలు తీస్తున్నారు? చెట్లు తొలగిస్తున్నారని ప్రశ్నించగా.. అది తమ భూమి అని దబాయించారు. దాంతో కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆలయ కమిటీ సభ్యులు మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లడంతో ఇంతేజార్ గంజ్ సీఐ శివకుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు దేవాలయ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

యజమాని ఇంటికే కన్నం

- రూ.38 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

వరంగల్ క్రైం : కూడుపెట్టిన తన యజమాని ఇంట్లో ప్రియుడు, అక్కతో కలిసి చోరీకి పాల్పడిన నిందితులను సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.38లక్షల విలువైన (470గ్రాముల) బంగారు ఆభరణాలతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా రంగశాయిపేటకు చెందిన కత్రి కళ్యాణి(అలియాస్ తునిగర్ కళ), నెక్కొండ మండలం చంద్రుగొండ తండాకు చెందిన మూడు చంటి, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం జామతండాకు చెందిన మౌర్య సునీతను సుబేదారి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. అయితే కత్రి కళ్యాణి హనుమకొండలోని సంతోష్‌నగర్‌లో నివాసముంటున్న డాక్టర్ కీసర ఇంద్రారెడ్డి ఇంట్లో కొంతకాలం నుంచి పని మనిషిగా కుదిరింది. ఈ క్రమంలో నిందితురాలికి తన యజమాని ఇంట్లోని బంగారం చోరీ చేసి సులభంగా డబ్బు సంపాదించి జల్సా జీవితాన్ని గడపలానే ఆశపుట్టింది. దీంతో ఫిబ్రవరిలో తన ప్రియుడు చంటి, అక్కతో కలిసి యజమాని ఇంట్లోని బంగారు ఆభరణాలను నాలుగు దఫాలుగా చోరీ చేసింది. అనంతరం చోరీ సొత్తును విక్రయించి కారు కొనుగోలు చేసినట్లు సీపీ వెల్లడించారు. అయితే యజమాని తన ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ అయినట్లుగా గుర్తించి సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఫారెస్ట్ ఆఫీస్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా వస్తున్న కారును సోదా చేయగా నిందితులను గుర్తించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకోని విచారణ చేయగా డాక్టర్ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు వారు అంగీకరించారు. నిందితులను పట్టుకొని చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ చూపిన సెంట్రల్ డీసీపీ అబ్దుల్ బారీ, హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, సుబేదారి ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బందిని అభినందించి, నగదు రివార్డులు అందజేశారు.

మద్దతు ధర చట్టం కోసం ఉద్యమించాలి

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్



సదస్సులో మాట్లాడుతున్న చంద్రకుమార్

కాశిబుగ్గ: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర చట్టానికి రైతులు ఉద్యమం చేయాల్సిందేనని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. శుక్రవారం క్రిస్టియన్ కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన బి.చంద్రకుమార్ మాట్లాడుతూ దేశాన్ని దోచుకునే వారికి అనుకూలంగా చట్టాలు ఉన్నాయని, రైతు పండించే పంటలకు మాత్రం చట్టాలు లేవని ఇది ఆయా రాజకీయ పార్టీల వైఫల్యమేనని విమర్శించారు. రైతును కాపాడాకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందని, వారికి మద్దతుగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట నారాయణ మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ఆహార భద్రత ఉండాలన్న, రైతుల ఆత్మహత్యలు నివారించాలన్న యువకులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో యాదగిరి ఆచార్యులు, వీరస్వామి, రైతు సంఘాల నాయకులు గడ్డం సదానందం, రాచర్ల బాలారాజు, వల్లందాస్ కుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, సోమ రామ్మూర్తి, ఐత నగేష్, ఊరటి హంసల్‌రెడ్డి, సిరుల రవీందర్, మోహన్ రావు, బుచ్చిరెడ్డి, అంబయ్య, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదుకు జరిమానా

పెద్దవంగర : తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన ఓ మహిళకు మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసులేటి చంద్రశేఖర్ ప్రసాద్ జరిమానా విధించినట్లు శుక్రవారం ఎస్సై మహేష్ ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 2023 సెప్టెంబర్ 22న తన కూతురుపై అత్యాచారం చేశారని పేర్కొంటూ ఓ మహిళ తప్పుడు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆరు నెలల పాటు విచారించి న్యాయస్థానంలో సాక్షులను విచారించారు. తల్లి తప్పుడు ఫిర్యాదు చేసినట్లు ఈ నెల 12న నిర్ధారణయ్యింది. దీంతో రూ.50 వేలు జరిమానా లేదా మూడు నెలల పాటు జైలుశిక్షను కోర్టు విధించింది. తప్పుడు ఫిర్యాదు చేసిన తల్లి శుక్రవారం జిల్లా కోర్టులో రూ.50 వేల జరిమానా చెల్లించింది. విలువైన కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని, అసత్య ప్రచారం, తప్పుడు ఫిర్యాదులతో కోర్టును తప్పుదోవ పట్టించాలని చూస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS

■ స్త్రీ/పు. అవకాశం తక్కువ పెట్టుబడితో 25 రకాల వెజ్ - నాన్ వెజ్ పచ్చళ్ళ షాపుని మీ ఏరియాలో స్థాపించి నెలకు 30 వేలు ఆపైన ఆదాయం పొందండి. 8143909459. [W-1264887]

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agentsగా కావలెను. Ph: 7988242391 [H-778707]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217 [M-1185048]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ. 18K. Ph: 9640258899/ 9640468899 [H-799871]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



ప్రతీకాత్మక చిత్రం

పరంపర

సెలవులొచ్చేశాయ్ ఫోన్ పక్కన పడేద్దామా

సెలవులొచ్చేది ఆటల కోసం, స్నేహాల కోసం బంధువుల కోసం, విహారాల కోసం, వినోదాల కోసం పిల్లలు ఇంతకాలం ఫోన్లలో కూరుకుపోయారు. వారిని ఫోన్ల నుంచి బయటకు తెండి. మీ బాల్యంలో సెలవుల్లో ఎలా గడిపారో అలా గడిపేలా చేయండి. పెద్దయ్యాక తలుచుకోవడానికి బాల్యం లేకపోవడానికి మించిన విషాదం లేదు.

ఆటస్థలాలు లేని స్కూళ్లలో చదివించడం, ఆడుకునే వీలు లేని ఇళ్లలో నివసించడం, పార్కులు లేకపోవడం, ఆడుకోవడానికి తోటి పిల్లలు లేని వాతావరణంలో జీవించడం, ఇవన్నీ ఉన్నా పిల్లలతో గడిపే సమయం తల్లిదండ్రులకు లేకపోవడం... వీటన్నింటి వల్ల పిల్లలకు స్కూల్, ఇల్లు కాకుండా తెలిసింది ఒకే ఒక్కటి. సెల్‌ఫోన్. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇచ్చి వారు వాటిలో కూరుకుపోతే ‘అమ్మయ్య. మా జోలికి రావడం లేదు’ అనుకునే తల్లిదండ్రులు ఉన్న ఈ కాలంలో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆటలు, విహారం, అనుబంధాల విలువ, కొత్త విషయాల ఎరుక ఎలా కలుగుతుంది?

అందుకే వేసవి సెలవులు ఒక పెద్ద అవకాశం. ఇరవై ముప్పై ఏళ్ల క్రితం వరకు తెలుగు ప్రాంతాలలో వేసవి సెలవులు వస్తే పిల్లలు ఎలా గడిపేవారో ఇప్పుడూ అలా గడిపే అవకాశం కల్పించవచ్చు. కాకుంటే తల్లిదండ్రులు ప్రయత్నించాలి. పిల్లలను మోటివేట్ చేయాలి.

బంధువులు- బంధాలు

బంధువులు ఎవరో తెలియకపోతే బంధాలు నిలవవు. ఎంత స్వతంత్రంగా జీవిద్దామనుకున్నా, సాటి మనుషుల విసిగింపును తప్పించుకుని తెగదెంపులు చేసుకుని బతుకుదామనుకున్నా మనిషి సంఘజీవి. అతడు బంధాలలో ఉండాల్సిందే. బంధాల వల్ల బతకాల్సిందే. పిల్లలకు బంధాలు బలపడేది, బంధాలు తెలిసేది వేసవి సెలవుల్లోనే. ఇంతకు ముందు పిల్లలు వేసవి వస్తే తల్లిదండ్రులను వదిలిపెట్టి పిన్ని, బాబాయ్, పెదనాన్న, తాతయ్య... వీళ్ల ఇళ్లకు వెళ్లి రోజుల తరబడి ఉండేవారు. వారి పిల్లలతో బంధాలు ఏర్పరుచుకునేవారు. దీని వల్ల కొత్త ఊరు తెలిసేది. ఆటలు తెలిసేవి. కలిసి వెళ్లిన సినిమా అలా ఓ జ్ఞాపకంగా మిగిలేది. ఇవాళ పెద్దల పట్టింపులు పిల్లలకు శాపాలవుతున్నాయి. రాకపోకలు లేని బంధుత్వాలతో పిల్లలు ఎక్కడకూ వెళ్లలేని స్థితి దాపురించింది. దీనిని సరి చేయాల్సిన బాధ్యత పెద్దలదే. లేకుంటే పిల్లలు ఫోన్లనే బంధువులుగా భావించి అందులోని చెత్తను నెత్తికెక్కించుకుంటారు. జీవితంలో సవాళ్లు ఎదురైన సమయంలో ఒంటరితనం ఫీలయ్యి అతలాకుతలం అవుతారు.

తెలుగు ఆటలు

సెలవుల్లో పిల్లలకు తెలుగు ఆటలు తెలియడం ఒక పరంపర. బొంగరాలు, గోలీలు,



వామనగుంటలు, పరమపదసోపాన పటం, ఒంగుళ్లు-దూకుళ్లు, నేల-బండ, ఏడుపెంకులాట, పులి-మేక, నాలుగు స్తంభాలాట, వీరి వీరి గుమ్మడిపండు, లండన్ ఆట, రైలు ఆట, పొడుపుకథలు విప్పే ఆట, అంత్యాక్షరి, కళ్లకు గంతలు... ఈ ఆటల్లో మజా తెలిస్తే పిల్లలు ఫోన్ ముట్టుకుంటారా?

కథ చెప్పుకుందామా

కథలంటే పిల్లలకు ఇష్టం. పెద్దలు చెప్పాలి గాని. ఈ సెలవుల్లో రాత్రి పూట భోజనాలయ్యాక, మామిడి పండ్లు తిన్నాక, పక్కలు వేసుకుని అందరిని కూచోబెట్టి పెద్దలు కథలు చెప్తే ఎన్నెన్ని తెలుస్తాయి! ఎన్ని ఊహల కవాటాలు తెరుచుకుంటాయి. మర్యాద రామన్న, తెనాలి రాముడు, బేతాళుడు, సింద్‌బాద్, ఆలీబాబా, పంచతంత్రం, రామాయణం, మహాభారతం... భీముడిలోని బలం, అర్జునుడిలోని నైపుణ్యం... ఇవి కదా చెప్పాలి.

బలం కోసం తిండి:

పిల్లలను సరిగ్గా గమనించి వారికి కావలసిన బలమైన తిండి తినిపించడానికి వీలయ్యేది ఈ సెలవుల్లోనే. బలహీనంగా ఉండే పిల్లలు, ఎదిగే వయసు వచ్చిన ఆడపిల్లలకు ఏమేమి వొండి తినిపించాలో పెద్దల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు ఈ కాలంలో తినిపిస్తారు. శిరోజాల సంరక్షణ, చర్మ సంరక్షణ, పంటి వరుస సరి చేయించడం, జీర్ణశక్తిని ఉద్దీపన చేయడం, బంధువుల రాక వల్ల లేదా బంధువుల ఇంటికి వెళ్లడం వల్ల పిల్లలందరికీ కలిపి వారికి వృద్ధి కలిగించే ఆహారం చేసి పెట్టవచ్చు. తోటి పిల్లలు పక్కన ఉంటే ఇష్టం లేకపోయినా పిల్లలు తింటారు.

సెలవులొచ్చేది పిల్లల మానసిక, శారీరక వికాసానికి. కదలకుండా మెదలకుండా ఫోన్ పట్టుకుని కూచుని వారు ఈ సెలవులు గడిపేస్తే నింద తల్లిదండ్రుల మీదే వేయాలి... పిల్లల మీద కాదు.

గెలుపు దారి

పాకశాస్త్ర ప్రవీణ

చండీగఢ్‌కు చెందిన 23 సంవత్సరాల దేవిక మన్‌చందానీ ఇప్పుడు న్యూయార్క్‌లోని ప్రముఖ చెఫ్‌లలో ఒకరు. వంటలకు సంబంధించిన ఎన్నో పోటీల్లో బహుమతులు గెలుచుకుంది. పేస్ట్రీ చెఫ్‌గా రకరకాల ప్రయోగాలు చేస్తూ తనదైన ప్రత్యేకత చాటుకుంటోంది.

చిన్నప్పటి నుంచి దేవికకు వంటలన్నా, కొత్త వంటకాల గురించి తెలుసుకోవడం అన్నా చాలా ఇష్టం. ఆ ఇష్టమే తనని చండీగఢ్ వీధుల నుంచి న్యూయార్క్‌లోని ప్రసిద్ధ రెస్టారెంట్‌ల వరకు తీసుకెళ్లింది. ఆమె కుటుంబంలో, బంధువులలో పాకశాస్త్ర ప్రవీణులు ఎంతో మంది ఉన్నారు. వారి దగ్గరి నుంచి ఎన్నో కుటుంబ వంటకాలను నేర్చుకుంది.


వంటలపై దేవిక ఇష్టం ఎక్కడిదాకా వెళ్లిందంటే న్యూయార్క్‌లోని కలినరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమెరికా(సిఐఎ)లో చదివే వరకు. పాకశాస్త్ర పరిధిని విస్తరించుకోవడానికి, ప్రావీణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈ చదువు దేవికకు ఉపయోగపడింది.

‘సిఐఎ’లో అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డ్ నుంచి నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఇచ్చే అవార్డ్ వరకు ఎన్నో అవార్డ్‌లు అందుకుంది దేవిక.

‘స్కిల్స్ యూఎస్‌ఏ బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్’ పోటీల్లో పాల్గొనడం దేవిక కేరీర్‌లో మైలురాయిగా నిలిచింది. ఆ పోటీలో పాల్గొన్న ఏకైక భారతీయురాలిగా గుర్తింపు పొందింది. అంతేకాదు, ఆ పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయం తనని రెండు అడుగులు ముందుకు వేసేలా చేసింది. ప్రసిద్ధ ‘గాబ్రియెల్’ రెస్టారెంట్‌కు సంబంధించి ముఖ్యమైన ఈవెంట్స్‌కు నాయకత్వం వహించేలా చేసింది.

ఆ రెస్టారెంట్‌లో ఎప్పటికప్పుడూ కొత్త కొత్త సవాళ్లు ఎదురయ్యేవి. క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించి బాగా తెలిసిన దేవిక ఆ సవాళ్లను అధిగమించింది.

ఒక విజేతగా సిఐఏ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం చేసే



దేవిక మన్‌చందానీ

అవకాశం దేవికకు వచ్చింది. ‘పాత్ వేస్ టు ఎక్స్‌లెన్స్’ అంశంపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేసింది. ‘ఎగ్జయిట్‌మెంట్‌కు ఎనర్జీ తోడైతే ఎంత విజయాన్ని అయినా సాధించవచ్చు’ అంటుంది దేవిక.

‘స్కిల్స్ యూఎస్‌ఏ’ రాష్ట్ర స్థాయి పోటీలకు న్యాయనిర్ణేత పాత్ర పోషించిన దేవిక ‘బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్’కు సంబంధించిన పోటీకి పోటీ పడుతున్న తరువాతి తరం విద్యార్థులకు మార్గనిర్దేశం చేసింది.

సూపర్ స్పీకర్

దేవిక మన్‌చందానీ చెఫ్ మాత్రమే కాదు స్ఫూర్తిదాయక వక్త కూడా. ఆమె వంటలతో పాటు ఉపన్యాసాలకు కూడా ఎంతోమంది అభిమానులు ఉన్నారు. పనిచేస్తున్న క్రమంలోనే క్రైసిస్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన సూత్రాలు పట్టుబడతాయని చెబుతుంది దేవిక. చదువుల కోసం వేరే దేశం వెళ్లే విద్యార్థులకు రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి. తాను అమెరికాకు వచ్చినప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి, వాటిని అధిగమించిన తీరును విద్యార్థులకు చెబుతుంటుంది దేవిక.



‘ఎంతో కొంత నేర్చుకున్నాను అనే తృప్తి కంటే ‘ఇంకా ఎంతైనా నేర్చుకుంటాను’ అనే దాహం విజయానికి దారి చూపుతుంది అంటుంది దేవిక.

‘లక్ష్యం మీద అయోమయం కాదు స్పష్టత ఉండాలి’ అంటున్న దేవిక ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తుంది.

పేస్ట్రీ చెఫ్ కావాలనే కలతో చండీగఢ్ నుంచి అమెరికాకు వెళ్లిన దేవిక తన కలను నెరవేర్చుకోవడమే కాదు చిన్న వయసులోనే ప్రముఖ ‘పేస్ట్రీ చెఫ్’గా పెద్ద పేరు తెచ్చుకుంది.

స్త్రీ శక్తి

సముద్రంపై సాహస సంతకం



‘భయంతో కాదు ప్రేమతో మాత్రమే సముద్రంలో ప్రయాణం చేయగలం’ అనే మాట ఉంది. వందమందిలో ఒకరిగా సముద్రప్రయాణం వేరు. ఒకరిద్దరుగా వేరు. దిల్నా కె, రూప ఎ ఇరవై రెండు రోజుల పాటు సముద్ర ప్రయాణం చేశారు. కొన్నిసార్లు సముద్రం తన మౌన గాంభీర్యాన్ని వీడి కోపంతో గర్జించేది. ప్రశాంతం అనుకున్న సాగరంలో కల్లోలం మొదలయ్యేది. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులకూ ఈ ఇద్దరూ భయపడలేదు.

భారతీయ నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా కె, లెఫ్టినెంట్ కమాండర్ రూప ఎ ‘ఐఎన్‌ఎస్వీ’ తరిణితో సముద్ర సాహస యాత్రని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా ప్రత్యేకత చాటుకున్నారు. ‘తరిణి’ నౌకలో గోవా నుంచి బయలుదేరి 22 రోజుల తరువాత మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు చేరుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని విజయవంతంగా సముద్రయాత్ర చేసిన దిల్నా, రూపలు శభాష్ అనిపించుకున్నారు.

ఫిబ్రవరి 28న గోవాలోని ఐఎన్‌ఎస్వీ మండోవి నుంచి మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు బయలుదేరింది తరిణి. గమ్య స్థానానికి చేరుకున్న తరువాత రెండు దేశాల (భారత్, మారిషస్)ల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు, విన్యాసాల్లో మారిషస్ కోస్టు గార్డ్‌లతో కలిసి పాల్గొన్నారు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూప.

‘ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా నిలిచారు. వీరి విజయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది’ అని దిల్నా, రూపలను ప్రశంసించింది నావికాదళం.

సముద్ర ప్రయాణ కాలంలో భారీ గాలులు, ప్రతికూల సముద్ర పరిస్థితుల రూపంలో దిల్నా, రూపలకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అయితే ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదు.

‘ఒక్కసారి అధైర్యపడితే ఓటమికి ఆహ్వానం పంపినట్లే.

రెండోసారి అధైర్య పడితే ఓటమి మీ గుమ్మం వరకు వచ్చినట్లే.

మరోసారి కూడా భయపడితే ఓటమి ఇంట్లోకి వచ్చినట్లే’ అని శిక్షణ సమయంలో విన్న మాటను వారు బాగా గుర్తుపెట్టుకున్నారు.

సముద్రమంత సాహసం



దిల్నా రూప

నాలుగు ప్రయత్నాల తరువాత అయిదోసారి నేవీకి ఎంపికైంది కేరళలోని కోజికోడ్‌కు చెందిన దిల్నా కె. నావికాదళంలోకి ప్రవేశించడానికి ముందు ఆర్చరీ. క్రికెట్‌లో ప్రతిభ చాటుకుంది. నేవీ షూటింగ్ టీమ్‌లో ఒకరైన దిల్నాకు రోటిన్ యాత్రల కంటే సాహస యాత్రలు అంటే ఇష్టం. పుదుచ్చేరికి చెందిన రూప అలగిరిసామికి స్ఫూర్తి... కల్పనాచావ్లా. చెన్నైలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేసింది. సాహసాలకు మారుపేరుగా నిలిచిన మహిళల జీవితచరిత్రలు చదవడం అంటే ఇష్టం. ఈ ఇద్దరికి ప్రముఖ నావికుడు, గోల్డెన్ గ్లోబ్ రేస్ హీరో అభిలాష్ టోమి (రిటైర్డ్) శిక్షణ ఇచ్చారు. ఐఎన్‌ఎస్వీ నౌకలో ప్రపంచాన్ని చుట్టివచ్చిన భారతీయుడిగా టోమి రికార్డ్ సృష్టించాడు. గత సంవత్సరం దిల్నా కె, రూపలు ఆరుగురు సభ్యుల బృందంతో కలిసి గోవా నుంచి కేప్‌టౌన్ మీదుగా రియో డి జనీరోకు 188 రోజుల పాటు నౌకాయానం చేశారు.

ఈ నెల 21న గోవాలోని మండోవికి తిరిగి వచ్చిన ఐఎన్‌ఎస్వీ తరిణికి నావికా సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సముద్ర యాత్రకు దిల్నా, రూపలను తేలిగ్గా ఎంపిక చేయలేదు. కఠినమైన ఎంపిక ప్రక్రియతో అనేక వడపోతల ద్వారా వీరిని ఎంపిక చేశారు.

వీరి సాహసం ఇక్కడితో ఆగిపోదు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న ‘సాగర్ పరిక్రమ’ అనే భూగోళ ప్రదక్షిణ కోసం ఈ ఇద్దరూ సన్నద్ధమవుతున్నారు.

‘సాహసం’ లోని విశేషం ఏమిటంటే... దానిపక్కన ఫుల్‌స్టాప్ ఎప్పుడూ ఉండదు. ఒక సాహసం మరో సాహసాన్ని ప్రేరేపిస్తుంది. విజయం సాధించేలా చేస్తుంది. ‘సాగర్ పరిక్రమ’లో కూడా దిల్నా, రూపలు విజయం సాధించాలని ఆశిద్దాం.

ఇంటి పనులతోనే రోజంతా గడిచిపోతుంటుంది అభిరుచిని మెరుగుపరుచుకోవాలన్నా సమయమే సరిపోదనిపిస్తుంది. కానీ, కొందరు మాత్రమే ఉన్న కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమతోపాటు మరికొందరికి ఉపాధి అవకాశాలను అందిస్తుంటారు. ఈ కోవకే చెందుతారు సవిత ఆలంపల్లి. తెలంగాణలోని జహీరాబాద్ వాసి అయిన సవిత కాటన్ ఫ్యాబ్రిక్‌పైన సహజసిద్ధమైన పువ్వులు, ఆకులతో సహజమైన ప్రింట్లను తీసుకువస్తుంది. అదే ఫ్యాబ్రిక్‌ని ఉపయోగిస్తూ మోడ్రన్ డ్రెస్సులను డిజైన్ చేస్తోంది. వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ, బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేసి, సెల్ఫ్ మేడ్ బిజినెస్ ఉమన్‌గా తనని తాను నిరూపించుకుంటుంది. ఆసక్తిని ఉపాధిగా మలుచుకునేందుకు చేసిన ప్రయాణంలో తాను వేసిన అడుగుల గురించి ఆనందంగా వివరించింది.

ఆకులో ఆకునై..

ఎకో ఫ్రెండ్లీ డ్రెస్ డిజైనింగ్



సవిత



వర్క్‌షాప్

“డిగ్రీ వరకు చదువుకున్న నేను పెళ్లయ్యాక మావారు రామకృష్ణతో కలిసి అమెరికాకు వెళ్లాను. గృహిణిగానే కొన్నాళ్లు ఉండిపోయాను. న్యూయార్క్ ఎఫ్‌ఐటిలో ఫ్యాషన్ డిజైనింగ్‌కి సంబంధించిన కోర్స్ చేశాను. పదేళ్ల క్రితం ఇండియా వచ్చి బెంగళూరులో స్థిరపడ్డాం. రోజంతా ఇంటిపనులు, పిల్లల పనులు ఉన్నా నా కోసం కొంత సమయాన్ని కేటాయించుకునే దాన్ని. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఉపయోగించే ఫ్యాబ్రిక్ తీవ్రమైన కాలుష్యానికి గురి చేస్తుందని తెలుసుకున్నాను. అప్పటినుంచి నా వంతుగా ఏదైనా చేయాలనుకుని ప్రయత్నాలు చేస్తుండేదాన్ని. ఫ్లోర్ క్లీనర్స్, సుగంధ ద్రవ్యాలు వంటివి ఇంట్లో తయారు చేస్తుండేదాన్ని. వాటివల్ల ఇంట్లో వాళ్లు కూడా చాలా మెచ్చుకునేవారు. ఎకో ప్రింటింగ్, సస్టెయిన్‌బుల్ ఫ్యాబ్రిక్స్ పైన వర్క్ చేయడం మొదలుపెట్టాను. ప్రకృతి ద్వారా లభించే వస్తువులతో రోజూ ఏదో ఒక ప్రయోగం చేస్తుండే దాన్ని.

ఆకులు – పువ్వులు

పూజలు, ఇతర సంప్రదాయ వేడుకలలో పువ్వులు, ఆకులను కూడా ఉపయోగిస్తుంటాం. సాధారణంగా వాటిని ఉడకబెట్టి, టై అండ్ డై చేస్తుంటారు. నేను వాటిని ఎండబెట్టి, కొన్నింటిని తాజాగా ఉన్నప్పుడే ఫ్యాబ్రిక్ మీద చల్లి, దగ్గరగా చుట్టి, కొన్ని రోజులు అలాగే ఉంచి ప్రయోగాలు చేసే దాన్ని. ప్రయత్నాలు చేయగా చేయగా ఫ్యాబ్రిక్‌పైన రకరకాల డిజైన్స్ అమితంగా నన్ను ఆకట్టుకున్నాయి. మోదుగ, శంఖపుష్ప, పారిజాత.. వంటివే కాదు అరుదుగా పూసే పువ్వులనూ సేకరిస్తాను. వాటిని ఎండబెట్టి నిల్వ ఉంచుతాను. మామిడి, జామ, మందార ఆకులనూ డిజైన్‌కు వాడుతుంటాను. ఏ మాత్రం రసాయనాలు లేని ప్రయోగం ఇది.

ఇంటి నుంచి స్టూడియో వరకు

రసాయనాలతో పండించే పత్తి కాకుండా వర్షాధార పంటద్వారా వచ్చే కాటన్ ఫ్యాబ్రిక్‌ను కలెక్ట్ చేసి, నా ప్రయత్నాలను ఇంకా విరివిగా చేయడం మొదలుపెట్టాను. సస్టెయిన్‌బుల్ డ్రెస్సులు అంటే చాలావరకు వదులుగా ఉండే దుస్తులు అనుకుంటారు. కానీ, మంచి ఫిటింగ్, డిజైన్, ప్రింట్లతో ఈ తరం మెచ్చేలా డ్రెస్ డిజైనింగ్ చేయాలనుకున్నాను. కార్పొరేట్ ఉమెన్‌కు నప్పే విధంగా, అలాగే టీనేజ్ కలెక్షన్స్ కూడా ప్రిపేర్ చేస్తుంటాను. ఎకో ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్, ప్రింటింగ్.. డ్రెస్సులు ధరిస్తే ఒంటికి పాజిటివ్ ఎనర్జీ లభిస్తుంది. ప్రకృతికి దగ్గరగా ఉన్నామన్న అనుభూతి సొంతం అవుతుంది. ఏడెనిమిదేళ్లుగా సస్టెయినబిలిటీ మీద రకరకాల ప్రయోగాలు చేసి, ఐదేళ్ల క్రితం ‘టింక్టోరియా’ పేరుతో బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేశాను. ఆకులలో ఉండే జీవాన్ని టింక్టోరియా అంటారు. దానిని ఫ్యాబ్రిక్ మీదకు తీసుకురావాలని చేసిన ప్రయత్నం కాబట్టి అదే పేరును నా డిజైన్స్‌కు పెట్టాను. ఇంటినుంచి స్టూడియోదాకా మారేందుకు చేసిన రకరకాల ప్రయోగాల వల్ల ఇప్పుడు నాతో పాటు మరో ఐదుగురు మహిళలకు ఉపాధి అవకాశాలు లభించాయి. మేమంతా కలిసి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌కు వచ్చిన ఆర్డర్స్ ప్రకారం పని చేస్తుంటాం.







అవగాహనకు వర్క్‌షాప్స్

ఎకోప్రింటింగ్ పట్ల ప్రజలలో అవగాహన కల్పించడానికి హైదరాబాద్, బెంగళూరు ఇతర క్రాఫ్ట్ ఎగ్జిబిషన్స్‌లలో ఉచితంగా వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాను. స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటాను. అక్కడి వచ్చి, ఆసక్తితో నేర్చుకుంటాను అనేవారు మళ్ళీ మళ్ళీ ఫోన్ చేసి ప్రింటింగ్ ప్రాసెస్ అడుగుతుంటారు. చాలా మందికి ఆకులతోనూ, పువ్వులతోనూ డిజైన్ చేస్తారని తెలియదు. ఈ డిజైన్ ఉతికితే పోతుందేమో అనుకుంటారు. కానీ, సరైన విధంగా చేస్తే రంగు ఏ మాత్రం పోదు. ముందు కుంకుడుకాయ రసంతో ఫ్యాబ్రిక్‌ను శుభ్రం చేస్తాం. ఆ తర్వాత ఆకులను, పువ్వులను అనుకున్న డిజైన్స్‌లో అమర్చి, దగ్గరగా చుట్టి, ఆవిరిమీద ఉంచుతాం. ఆ తర్వాత బయటకు తీసి, ఒక రోజంతా అలాగే ఉంచుతాం. ఆ తర్వాత పూర్తిగా విప్పి, క్లాత్‌ని శుభ్రం చేస్తాం. సరైన డిజైన్ రావడానికి 3 నుంచి 4 రోజుల సమయం పడుతుంది. షిబోరి, టై అండ్ డై, కలంకారీ డిజైన్స్‌తోపాటు నేతకారులతో ముందే మాట్లాడి ఫ్యాబ్రిక్ డిజైన్‌లో మోటిఫ్ ప్రింట్స్ వచ్చేలా గైడెన్స్ ఇస్తుంటాను. కొన్ని రకాల ఆకులు, పువ్వుల ప్రింటింగ్‌లో థ్రెడ్ వర్క్ కూడా ఉంటుంది. ప్రకృతిపైన ప్రేమ, ఇష్టంతో నన్ను నేను కొత్తగా మార్చుకునే క్రమంలో ఎంచుకున్న మార్గం ఇది. ఇంట్లో వాడాల్సిన కెమికల్స్ స్థానంలో ఏ మాత్రం రసాయనాలు లేని వస్తువులను తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాను. ఈ విధానం వల్ల ఐదారేళ్లలో నాదైన ఓ కొత్త ప్రపంచాన్ని నిర్మించుకున్నాను అనిపిస్తుంది’ అని ఆనందంగా వివరిస్తారు సవిత.



మోడల్

– నిర్మలారెడ్డి